59

# అడవి భూతం

అది నల్లమల కొండలలో ఒక దట్టమైన అడవి.

'కాకులు దూరని కారడవి, చీమలు దూరని చిట్టడవి' అంటారే- అటువంటిదన్నమాట! ఆ అడవిలో 'కొండరాజు' అనే గిరిజనుడు ఉండేవాడు. జంతువులను వేటాడి కుటుంబ పోషణ చేస్తుండేవాడు. అడవిలో దొరికే పుట్టతేనె, ఇప్ప పువ్వు, చింతపండు, తుమ్మ జిగురు, కుంకుళ్ళు... వంటివి సేకరించి, నెలకోసారి పట్నం వెళ్లి వాటిని అమ్మి ఇంటికి కావలసిన ఇతర సామాన్లు తెచ్చుకుంటుండేవాడు.

అప్పుడప్పుడు ఆ అడవిలో వేటకి జమీందార్లు, షికారీలు వస్తుండేవారు. వారు కొండరాజు సహాయం తీసుకుని, అందుకు ప్రతిఫలంగా కొంత డబ్బు ఇస్తుండేవారు.

కొండరాజుకి ఇద్దరు పిల్లలు – పదేళ్ల నాగరాజు, ఎనిమిదేళ్ల నాగి.

వాళ్ళకి ఆ అడవిలో తమ ఇంటి చుట్టూ వున్న కొంచెం ప్రదేశంతప్ప– వేరే ప్రపంచమేమీ తెలీదు. దూరంగా పోయి ఇతర ప్రపంచం చూడాలని వారికి ఎంత ఉబలాటంగా వున్నా ఆ అవకాశం ఎప్పుడూ రాలేదు.

ఒక రోజున – ఎవరో జమీందారు వేటకి వస్తుంటే కొండరాజు ఆయనకు సహాయంగా ఉండడానికి వెళ్లాడు. రెండురోజులదాకా ఇంటికి తిరిగిరానని చెప్పాడు.

ఆ మర్నాడు ఇంటిలో బియ్యం బొత్తిగా లేకపోయాయి. అందువల్ల కొండరాజు భార్య చెంద్రి– పిల్లల్ని పిలిచి, కొంచెం దూరంలో వున్న వెదురు దుబ్బులను కొట్టి వెదురు బియ్యం తెమ్మని చెప్పి పంపించింది.

నాగరాజు, నాగి ఉత్సాహంగా బయలుదేరారు. వెదురు దుబ్బులు కొంచెం దూరంగానే ఉన్నాయి. అంత దూరం వాళ్ళెప్పుడూ వెళ్లలేదు.



ఆ రోజు అడవిలో అలా దూరం దూరంగా వెళుతుంటే వారికి చెప్పలేనంత సంతోషం వేసింది. ఎటుచూసినా పెద్ద పెద్ద చెట్లు, వాటిమీద రకరకాల పక్షులూ, మధ్య మధ్య గుట్టలూ... అవన్నీ చూస్తుంటే వాళ్ళకి సమయమే తెలియలేదు. సరదాగా కబుర్లు చెప్పుకుంటూ వాళ్ళు అలా అలా ముందుకు సాగిపోసాగారు.

కొంచెందూరంలో ఒక చిన్న గుట్టా , దానిమీద ఒక గుడీ కనిపిస్తున్నాయి. ఆ గుట్ట దగ్గరలోనే ఉన్నట్లనిపించింది వారికి . ఆ కాస్త దూరం వెళ్లి గుట్టమీద దేముడ్ని చూసి వచ్చేయాలనుకున్నారు. కాని , ఎంత దూరం వెళ్లినా అది దగ్గర్లోనే ఉన్నట్లనిపిస్తోంది కాని, దగ్గరకు మాత్రం రావడం లేదు.

ఎలాగైతేనేం... మరికొంత సేపటికి గుట్టని జేరి దైవదర్శనం చేసుకున్నారు.

అక్కడినుండి చూస్తే ఎదురుగుండా చదునైన నేల కనిపిస్తోంది . దానిమీద రెండు వరుసలలో పెద్ద పెద్ద చెట్లున్నాయి. ఆ చెట్ల ‹ వ్యన రెండు పొడవైన పాములు పక్కపక్కగా పడుకొని ఉన్నాయి.

వాటి తలా తోకా ఎక్కడ ఉన్నాయో తెలీడం లేదు. అంత పెద్ద పాములవి . అవి నిద్రిస్తున్నాయో, ఏమో... కదలకుండా పడుకొని ఉన్నాయి.

ఆ పాములు ముందుగా నాగి కంటపడ్డాయి. అన్న భుజాన్ని ఊపుతూ "అన్నా... అన్నా... అటు చూడు- ఎంత పెద్ద పాములో !" అంది భయంతో.

నాగరాజు అటు చూశాడు. నిజమే... చాలా పెద్ద పాములు!

వాళ్ళు ఎన్నో పెద్ద పాముల్ని, పది పదిహేను అడుగులు పొడవున్న వాటిని కూడా చూశారు కాని, ఇంత పొడవైన పాముల్ని ఎప్పుడూ చూడలేదు. అసలు అటువంటివి ఉంటాయని కూడా వారు వినలేదు.

"ఓయమ్మో- ఎంత పెద్దపాములో !" అన్నాడు నాగరాజు కూడా.

ఆశ్చర్యంతో కొయ్యబారిపోయి అటే చూస్తూ నిలుచుండిపోయారు వాళ్ళు.

ఇంతలో – దూరం నుంచి "టక ... టక "మంటూ నేలనే బద్దలు చేస్తున్నట్లుగా శబ్దం వినిపించింది. ఉన్నట్లుండి ఆ శబ్దాల మధ్య "గాండ్రు "మంటూ చెవులు అదరగొట్టే అరుపు వినిపించింది. ఆ అరుపుకి వాళ్ళ గుండెలు అవిసిపోయాయి.

ఇంతలో...

చూస్తుండగానే ఒక మహాభూతం నేలనీ, నింగినీ దద్దరిల్లజేస్తూ ఎదురుగా అమిత గంగా రాసాగింది. దానికి ఒక్కటే కన్ను. కంటి ప్రక్కలనుంచి మంటలు ఎగస్తున్నాయి. కంటి వకనుంచి తెల్లని పొగ వస్తోంది.

అప్పుడప్పుడు రాత్రుళ్ళు కూడా టక టక శబ్దాలూ, గాండ్రింపులూ వినబడుతుండేవి. అవేమిటని అడిగితే, "అడవి దయ్యాలు రాత్రిళ్ళు తిరుగుతుంటాయి" అనీ, "ఆ శబ్దాలు అవి చేసేవే" నని కొండరాజు చెప్తుండేవాడు.

తండ్రి చెప్పిన మహాభూతం అదేనని అర్థమయిపోయింది వారికి.

ఆ భూతం తమవైపే వస్తోంది. కంటపడితే మింగేస్తుంది.

పారిపోయే అవకాశం కూడా కనపడ్డంలేదు. పైగా... కొండరాజు వంటి వీరుడి పిల్లలై ఉండి, పారిపోతే నామోషీ కదూ!

క్షణాలమీద భుజానికి వేలాడుతున్న విల్లును చేతిలోకి తీసుకున్నాడు నాగరాజు. బాణం దానికి సంధించి బలంగా లాగి పట్టాడు.

ఆ భూతం దగ్గరకు రాగానే, గురి చూసి దాని కంటిమీదుగా బాణాన్ని వదిలాడు.

అతి పొడువైన ఆ మహాభూతం బాధతో బిగ్గరగా గాండ్రిస్తూ ఆ పడుకుని వున్న పాముల మీంచి అమిత వేగంగా పారిపోయింది.

విజయగర్వంతో అన్నా చెల్లెళ్ళిద్దరూ ఇంటికి వెళ్లారు.

జమీందారుగారు వేట రద్దు చేసుకోవడంతో, కొండరాజు కూడా అప్పటికి ఇంటికి తిరిగి వచ్చేశాడు.

అడవిలో తాము చేసిన సాహసకృత్యాన్ని అభినవ పూర్వకంగా చెప్పి, 'తమ బాణందెబ్బతో అంతటి మహాభూతమూ పరారయిం' దని గర్వంగా చెప్పారు.

"ఇంతకీ ...అదేం భూతం నాయనా!" అని నాగి ముద్దుగా అడిగింది.

కొండరాజు నవ్వుతూ "మీరు చూసింది ఒక విధంగా మహాభూతమే. అయితే... దానిని సృష్టించింది మనిషే. బస్తీ ప్రజలు దానిని 'రైలు' అంటారు. అది నిప్పులను మింగి, నీళ్ళని తాగి, పొగనీ, ఆవిరినీ వదులుతుంది. జనాన్ని, వారి సామానుని తనమీద కూర్చోబెట్టుకొని, ఇనుప పాముల మీద సాగిపోతూ ఒక ఊరి నుంచి మరో ఊరికి వెళ్తుంటుంది" అని చెప్పాడు.

"మరి వాళ్ళని ఆ దయ్యం ఏమీ చెయ్యదూ?" అన్నాడు నాగరాజు ఆశ్చర్యంగా.

"లేదు. ఆ మహా భూతాన్ని చేసింది మనిషేగా! అందువల్ల మనిషి చెప్పినట్లే వింటుంది. మనకి దగ్గర గ్రామంలో సర్కారువాళ్ళు గిరిజనులకు పాఠశాల పెట్టిన్నారు. అందులో మిమ్మల్ని జేర్పిస్తాను. అప్పుడు మీకు ఇటువంటి వింత విషయాలు ఎన్నో తెలుస్తాయి" అన్నాడు కొండరాజు.

★★★